క్లుప్తంగా

జీఎస్టీ 2.0 అమలుపై కమిషనర్ తనిఖీలు



సూపర్ మార్కెట్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్

ఆత్మకూరురూరల్: పట్టణంలోని దుకాణాల్లో జీఎస్టీ 2.0 అమలుపై మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. సోమశిల రోడ్డు సెంటర్‌లో ఉన్న రెండు సూపర్ మార్కెట్లలో జీఎస్టీ 2.0 ను అమలు చేయకపోవడాన్ని గుర్తించి వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిత్యావసరాలు, ఇతర వస్తువుల విక్రయాల్లో జీఎస్టీ 2.0ను అమలు చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట 3వ వార్డు కౌన్సిలర్ గౌస్‌బాషా, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ట్యాంకర్

ఆత్మకూరురూరల్: రోడ్డు పక్కన నిలిపి ఉన్న బొగ్గులోడు లారీని వెనుకగా పామాయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటన మండలంలోని వాశిలి వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటు చేసుకుంది. వివరాలు.. కృష్ణపట్నం పోర్టు నుంచి పూణేకు బొగ్గులోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ శనివారం రాత్రి వాసిలి వద్ద హైవే పక్కన నిలిపి నిద్రపోయాడు. ఆదివారం వేకువన కృష్ణపట్నం పోర్టు నుంచి గుంతకల్లుకు వెళ్తున్న పామాయిల్ ట్యాంకర్ అదుపుతప్పి నిలిపి ఉన్న బొగ్గులోడు లారీని వెనుకగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బొగ్గులోడు లారీ డ్రైవర్ యువరాజ్ స్వల్ప గాయాలయ్యాయి. ఆత్మకూరు ఎస్సై జిలానీబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపట్నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలను మంగళవారం నుంచి ఐదురోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సహస్రాధిక ప్రతిష్టాచార్యులు కనుమళ్ల సత్యనారాయణ, అర్చకుడు కులిచేటి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో కుంభాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. చివరి రోజైన 11వ తేదీ పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే రామాలయంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామి ఆలయంలో పుష్కర కుంభాభిషేకం, సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పండరి భజన, అగ్ని గుండం తొక్కడం, సీతారాముల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు

నాగార్పమ్మకు పొంగళ్లు



సంగం: మండలంలోని కోలగట్లలో పెన్నానది ఒడ్డున ఉన్న నాగార్పమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పవిత్ర పెన్నానది జలాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు



అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. వీధుల్లో గుంపులుగుంపులుగా తిరుగుతూ దాడి చేస్తుండడంతో రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు హడలిపోతున్నారు. ఇటీవల వీధి కుక్కల దాడిలో పలువురు చిన్నారులు గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రచారానికే కొనుగోలు కేంద్రాలు

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి కొరవడిన చిత్తశుద్ధి
- 60శాతం మేర కోతలు పూర్తయ్యాక ఏర్పాటు
- గోనెసంచులను అందుబాటులో ఉంచని వైనం
- 17శాతం తేమ నిబంధనలో సడలింపులు ఇవ్వక అన్నదాతలు ఆవేదన



వాశిలి వద్ద దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్: ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది. ఎడగారు కోతల ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇదే అదనుగా మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యం ధరలను తగ్గించేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తూ ఉండిపోయారు. దీంతో రైతుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఆలస్యంగా మేల్కొన్న ప్రభుత్వం 60శాతం మేర కోతలు పూర్తయ్యాక కొనుగోలు కేంద్రాలను తెరిచింది. అయితే కేంద్రాల్లో గోనెసంచులను రైతులకు అందుబాటులో ఉంచలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో గోనెసంచులను అందుబాటులో ఉంచి ముందస్తుగా అందజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గోనెసంచులను ఇవ్వకుండా రైతులే కొనుక్కుంటే రూ.4 ఇస్తామని ప్రకటించడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం విధించిన ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా ఉండాలనే నిబంధన కూడా అన్నదాతల్లో నిరాశను నింపింది. ఎడగారు పంట కోతలు ప్రారంభమైనప్పటి నుంచి అకాల వర్షాలు పడుతున్నాయి. దీంతో తేమతో నిండిన ధాన్యాన్ని ఆరబోసే పరిస్థితులు లేవు. దీనికి తోడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరలను తగ్గించేశారు. వర్షాల భయంతో అన్నదాతలు తప్పనిపరిస్థితుల్లో దళారులు అడిగిన ధరకు తెగనమ్ముకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 60 శాతానికిపైగా వరి కోతలు పూర్తయిన తరువాత 17శాతం తేమ నిబంధనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై అన్నదాతల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ 17 శాతానికి మించితే ఒక్క శాతం తేమకు క్వింటాకు ఒక కిలో చొప్పున అదనంగా తీసుకుని న్యాయం చేసిన విషయాన్ని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా 17శాతానికి మించి తేమ ఉంటే క్వింటాకు కిలో అదనపు ధాన్యం తీసుకొని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఈక్రాప్ నమోదుపైన విమర్శలు

ఆత్మకూరు చెరువు కింద సుమారు రెండు వేల ఎకరాల్లో ఎడగారు పంటను సాగు చేశారు. అయితే ప్రభుత్వం చేపట్టిన ఈక్రాప్ నమోదులో 900 ఎకరాల్లోనే సాగు జరిగినట్లుగా వ్యవసాయ అధికారులు నమోదు చేయడంపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణం అనుకూలించని పరిస్థితుల్లో కష్టపడి ఎడగారు పంట సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకునే పరిస్థితులు లేకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, మర్రిపాడు, తదితర ప్రాంతాల్లో వరి కోతలు ఇంకా సాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో గోనెసంచులు అందుబాటులో ఉంచి తేమ నిబంధనలను సడలించి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

ప్రభుత్వ విధానం రైతుల పాలిట శాపం

రైతులపై అనేక విషయాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉన్నాయి. ఎడగారు ప్రారంభంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అష్టకష్టాలు పడి పండించిన పంటను దళారులకు రైతులు అప్పనంగా అమ్ముకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం. ఇప్పటికైనా రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చిత్తశుద్ధితో కొనుగోళ్లు చేపట్టాలి.

–లక్కు కృష్ణ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం



చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం యనమదలలో పాలేటి గంగమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గంగమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని చందనం, కుంకుమతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సామూహికంగా గ్రామస్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గంగమ్మ ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఆయుర్వేదానికి ఆదరణ



తెల్లపాడులోని ఆయుర్వేద వైద్యశాల



ఆస్పత్రిలో ఉన్న ఆయుర్వేద మందులు

కలిగిరి: ప్రాచీన ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడంలో దోహదపడుతుండడంతో రోగులు ఆయుర్వేద వైద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. ఆయుర్వే మందులతో దుష్ప్రభావాలు పెద్దగా ఉండకపోవడం కూడా రోగులు ఈ వైద్యం వైపునకు మళ్లడానికి ప్రధాన కారణం. ఆయుర్వేద వైద్యులు కూడా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు. మందుల పనితీరు మెరుగ్గా ఉండటంతో వీటి వినియోగం ఎక్కువైంది. కేంద్ర ప్రభుత్వం ఆయుష్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఆయుర్వేద, యూనాని, హోమియో వైద్యశాలలను అభివృద్ధి చేస్తోంది. ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి, తెల్లపాడు, సిద్దకొండూరు, కొండాపురం, చిన్నక్రాక, జలదంకిలో ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. వాటిలో అన్ని రకాల వైద్యసేవలను వైద్యులు అందిస్తున్నారు. సాధారణ వ్యాధులతో దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి మందులు ఆయా వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరిగిన నేపథ్యంలో ప్రతిరోజూ వైద్యశాలలకు 30 నుంచి 50 మంది రోగులు వచ్చి వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు తీసుకెళుతున్నారు.

15 ఏళ్లుగా ఆయుర్వేద మందులు వాడుతున్నా



మా గ్రామంలో 15 ఏళ్లుగా ఆయుర్వేద వైద్యశాల ఉంది. 2018 లో అన్ని వసతులతో నూతన భవనాన్ని నిర్మించారు. వైద్యశాల ప్రారంభం నుంచి సాధారణ వ్యాధులకు ఆయుర్వేద మందులనే వాడుతున్నా.

–గంటం మాలకొండయ్య, తెల్లపాడు, కలిగిరి మండలం

మోకాళ్ల నొప్పులు బాగా తగ్గుతాయి



ఆయుర్వేద వైద్యశాలలో ఇచ్చే మందులతో మోకాళ్ల నొప్పులు బాగా తగ్గుతాయి. చిన్న చిన్న సమస్యలకు ఇంగ్లిష్ మందులు వాడను. ఆయుర్వేద మందుల వాడకంతో ఎటువంటి సమస్యలు ఉండడం లేదు.

– మార్నేళ్ల లక్ష్మమ్మ, తెల్లపాడు

అన్ని రకాల మందులు ఉన్నాయి



ఆయుర్వేదంలోని అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆయుర్వేద మందులు మంచి ప్రభావం చూపిస్తాయి. ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

–ఎం శ్రీరేఖ, వైద్యాధికారిణి, ఆయుర్వేద వైద్యశాల, తెల్లపాడు

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు రేపు

ఆత్మకూరురూరల్: పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వాల్మీకి సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన భవనంలో కూడా ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని 23వేల శ్లోకాలతో ఏడు ఖండాలుగా రచించి మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యంగా మలిచారన్నారు. అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, భార్యభర్తల సంబంధం, గురుభక్తి, శిష్యానురక్తి, స్నేహఫలం, ధర్మబలం, వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం వంటి ఎన్నో జీవిత పాఠ్యాలతో రామాయణ కావ్యం ఆదికావ్యంగా తరతరాలుగా బాసిల్లుతోందన్నారు. అటువంటి రామాయణ మహాకావ్యాన్ని అందించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వాల్మీకి బోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు, శివరామయ్య, ప్రధాన కార్యదర్శి బీసీ కోటయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సంగం: మండలంలోని పెరమన వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తుపాకుల కరుణాకర్ (27) నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లుగా సంగం పోలీసులు తెలిపారు. వివరాలు..బుచ్చిరెడ్డిపాళెం మండలం పోలినాయుడుచెరువుకు చెందిన తుపాకుల కరుణాకర్, పార్వతి దంపతులు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు వింజమూరు మండలంలో నిమ్మతోట వద్ద కాపలాదారులుగా ఉన్నారు. విజయదశమి పండగకు పార్వతి పిల్లలతో కలిసి ఉదయగిరిలోని పుట్టింటికి వెళ్లింది. కరుణాకర్ పోలినాయుడుచెరువులోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. శనివారం రాత్రి నెల్లూరుపాళెం మీదుగా వింజమూరుకు వెళ్లాలని నిర్ణయించుకుని మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో పెరమన వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని తొలుత ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కరుణాకర్ ఆదివారం మృతి చెందాడు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కరుణాకర్ మృతితో గిరిజన కుటుంబం వీధిన పడింది.

జోరుగా బెల్టుషాపులు

అనుమసముద్రంపేట: మండలంలో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. మండలంలో 33 గ్రామాలు ఉండగా, దాదాపుగా 40 బెల్టు దుకాణాలు నడుస్తున్నాయి. వాటిలో 24 గంటలూ మద్యాన్ని విక్రయిస్తుండడంతో పల్లెలు మత్తులో మునుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం షాపులను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారు. ఏఎస్‌పేట, హసనాపురంలోని మద్యం షాపులను దక్కించుకున్న టీడీపీకి చెందిన వ్యక్తులు వాటికి అనుబంధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలను తెరిపించారు. వాటిలో 24 గంటలూ మద్యాన్ని విక్రయిస్తున్నారు. మద్యాన్ని ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తూ దోచుకుంటున్నారు. బెల్టుషాపులను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా ఒక్కో బెల్టు దుకాణం నుంచి రూ.3వేల చొప్పున వసూలు చేస్తూ ఎక్సైజ్ శాఖకు వాటాలు ఇవ్వడంతో పాటు టీడీపీ నాయకులు పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోనే బెల్టు షాపుల జోలికి ఎక్సైజ్ అధికారులు వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గాలికుంటుతో ప్రాణనష్టం



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

వింజమూరు(ఉదయగిరి): పశువులు, జీవాలకు సోకే గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, దీనిని నిర్లక్ష్యం చేస్తే పశువులు, జీవాలు మృత్యువాత పడే అవకాశం ఉందని వింజమూరు మండల పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు తెలిపారు. సాధారణంగా వర్షాకాలంలో పెరిగే పచ్చిగడ్డి మేయడం వల్ల పశువులు, జీవాలకు ఈ వ్యాధి సోకుతుంది. దేశవాళీ పశువులకు ప్రాణనష్టం లేకపోయినా, సంకర జాతి పశురకాలపై తీవ్రప్రభావం చూపి ప్రాణహానిని కలుగజేస్తుంది. ఈ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సను ఆయన వివరించారు.

లక్షణాలు

- ఈ వ్యాధి వైరస్ ద్వారా పశువులకు సోకుతుంది. ఇది ఒక దాని నుంచి మరొక దానికి వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధి బారినపడిన పశువుల పాలు తాగిన దూడలకు కూడా ఇది సోకుతుంది. దూడలు త్వరగా మృతి చెందే అవకాశం ఉంది.
- పశువుల నోరు, గిట్టల మధ్యన బొబ్బలు ఏర్పడుతాయి. 3,4 వారాల తర్వాత అవి పగిలి పుండ్లుగా మారి చర్మం దెబ్బతింటుంది.
- పశువుల నోట్లో పుండ్లు ఏర్పడితే మేత మేయలేవు. పూర్తిగా నీరసించిపోతాయి. పడుకున్న దగ్గర నుంచి లేవలేవు. నోట్లో సొంగ కారుతోంది.
- పాల ఉత్పత్తి బాగా పడిపోతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది. దీంతో పశువులు వణుకుతూ ఇబ్బంది పడుతుంటాయి.

నివారణ ఇలా..

- క్రమం తప్పకుండా ముందుగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి.
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశు వైద్యశాలల్లో ఉచితంగా వేసే టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
- వ్యాధి సోకిన పశువులను వేరే చోట ప్రత్యేకంగా ఉంచాలి. పశువులు ఉండే షెడ్లను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి.వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రత్యేకంగా ఒక చోట వేసి గడ్డితో కప్పి కాల్చివేయాలి. వ్యాధి సోకిన పశువులను మేతకు తోలరాదు. చనిపోయిన పశువులను గుంత తీసి పూడ్చి వేయాలి.

చికిత్సా విధానం

- గాలికుంటు వ్యాధి సోకిన పశువుల కాలిగిట్టల మధ్య ఏర్పడే పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి శుభ్రం చేయాలి.వేపనూనె పూయాలి.
- నోటిలో ఏర్పడే పుండ్లకు బోరిక్,గ్లిసరిన్ కలిపి పూయాలి.వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



దగదర్తి: మండలంలోని సున్నపుబట్టీ సమీపంలోని ధాబా వద్ద జాతీయరహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.వివరాలు.. ముసునూరు ఇందిరమ్మకాలనీకి చెందిన అహ్మద్‌బాషా బేల్దారి మేస్త్రిగా పనిచేస్తున్నారు. నెల్లూరు నుంచి కావలి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి సర్వీసు రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడ్ని దగదర్తి పోలీసులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రరక్తస్రావం కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల బీజేపీ అధ్యక్షుడిగా అంబటి ఈశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం ఆయనకు నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తనకు పదవీబాధ్యతలను అప్పగించిన వంశీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా అంబటికి మండల బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు.

హిందుత్వం ఒక జీవన విధానం



ఆత్మకూరులో ప్రసంగిస్తున్న బోయిళ్ల జనార్ధన్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: హిందుత్వం అనేది ఒక మతానికి సంబంధించింది కాదని అనాధిగా ప్రతి వ్యక్తి ధర్మంతో ఆచరిస్తున్న జీవన విధానమని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన బోయళ్ల జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అలఘునాథస్వామి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకల్లో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ శాస్త్రాల్లో యద్భావం తద్భవతి, సర్వేజన సుఖినో భవంతు అనే సూక్తులు ఆచరణీయమని, పర మతాల్లో ఈ సందేశాలు మరెక్కడా కనిపించకపోవడాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. హిందూ సమాజం సంఘటితంగా ఉండాలన్నారు. విశ్వవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శి లక్ష్మయ్య, నగర కార్యవాహ గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం, సేవలను వివరించారు. ఆత్మకూరు ప్రాంత ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సంగంలో...

సంగం: స్థానిక శివాలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ సావర్కర్ ఆర్‌ఎస్‌ఎస్ సేవలను వివరించారు. హిందూ సమాజం సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ తీర్మానంతోనే విగ్రహ మార్పు

సోమశిల: పంచాయతీ తీర్మానంతోనే మహాత్మా గాంధీ విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేస్తున్నట్లుగా సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ పుల్లయ్య, పాలకవర్గ సభ్యులు తెలిపారు. మండల కేంద్రమైన చేజర్ల గ్రామ పంచాయతీలో బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు అక్రమంగా కూల్చారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో టీడీపీకి చెందిన వారు ఫిర్యాదు చేశారు. అలాగే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీంతో వారు స్పందించారు. ఆదివారం మాట్లాడుతూ విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేస్తామని ఆర్యవైశ్యులకు చెప్పామన్నారు. దురుద్దేశంతో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు.